క్లుప్తంగా

విశాఖ వ్యాలీ స్కూల్‌కు జాతీయ గుర్తింపు

- ఎక్స్‌ట్రార్డినరీ లీడర్‌షిప్ కేటగిరీలో ఆలిండియా మూడో ర్యాంక్



విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2023 సంవత్సరానికి గానూ ఎక్స్‌ట్రార్డినరీ లీడర్‌షిప్ కేటగిరీలో ఆలిండియా మూడో ర్యాంక్, రాష్ట్రంలో మొదటి ర్యాంక్ దక్కింది. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తన చాంబర్‌లో శనివారం విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్‌ను అభినందించారు. పాఠశా లలో ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాల చైర్మన్‌గా కలెక్టర్ మల్లికార్జున సూచనలు, సలహాలతో ఇక్కడ విద్య బోధిస్తూ.. తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు.

శరవేగంగా రహదారి విస్తరణ పనులు



పోలమాంబ ఆలయం నుంచి జరుగుతున్న రహదారి విస్తరణ పనులు

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులోని పోలమాంబ ఆలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్‌కు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పోలమాంబ ఆలయం నుంచి మానసిక ఆస్పత్రి కూడలి వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులు తుదిశకు చేరుకున్నాయి. తరువాతి దశలో మానసిక ఆస్పత్రి కూడలి నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్ వరకు విస్తరణ పనులు జరుగుతాయి. ఇప్పటికే ఈ మార్గంలో రోడ్డు విస్తరణకు అనుకూలంగా రహదారి పక్కన ఉన్న గోడలను తొలగించి మార్గం సుగమం చేశారు.

బీజేపీ రాష్ట్ర బ్యాంకింగ్ సెల్ కన్వీనర్‌గా రమణ



కె.వి.రమణ

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కమిటీలో రాష్ట్ర బ్యాంకింగ్ సెల్ కన్వీనర్‌గా సీనియర్ నాయకుడు కె.వి.రమణ నియమితుడయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు సిహెచ్.కుమారస్వామి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.వి.రమణ మాట్లాడుతూ పార్టీకి తాను అందించిన సేవలకు గుర్తింపుగా ఈ బాధ్యతలకు ఎంపిక చేశారన్నారు. పార్టీ బలోపేతంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తానని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తోపాటు ముఖ్య నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సంపత్ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి, దేవేరులకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం రద్దీగా ఉండడంతో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

దసరా ఉత్సవాలకు సిద్ధం

- నేటి నుంచి ఆలయాల్లో కార్యక్రమాలు
- నవరాత్రుల్లో కుంకుమ పూజలు, చండీ హోమాల నిర్వహణ



లలితాదేవి అమ్మవారు



పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్ : దసరా ఉత్సవాలకు ఆలయాలు శోభాయమానంగా సిద్ధమవుతున్నాయి. పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం, ఏయూ అవుట్‌గేట్ వద్దనున్న లలితా సుందరేశ్వర పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాలు ఈ నెల 23వ తేదీ వరకు జరుగుతాయి. ఆశ్వీయుజ శుద్ధ పాఢ్యమి నుంచి ఆశ్వీయుజ శుద్ధ దశమి వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు.

పోలమాంబ ఆలయంలో..

ఆలయంలో శరన్నవరాత్రి రోజుల్లో భక్తుల గోత్రనామాలతో ఉదయం, సాయంత్రం వేళల్లో లక్ష కుంకుమ పూజలు జరుపుతారు. రూ. 500 టిక్కెట్లు తీసుకుని భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చు. వీరికి అమ్మవారి ప్రసాదం అందిస్తారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాలయ మండపంలో విశేష కుంకుమ పూజలు జరుపుతారు.

ప్రత్యేక అలంకరణ..

ఉత్సవాలలో భాగంలో అమ్మవారిని 15న స్వర్ణకవచాలంకృత శ్రీ పోలమాంబగా, 16న శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా, 17న శ్రీ గాయత్రీదేవిగా, 18న శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా, 19న మూలా నక్షత్రం రోజున శ్రీ సరస్వతీదేవిగా, 20న శ్రీ అన్నపూర్ణాదేవిగా, 21న శ్రీ మహాలక్ష్మిగా, 22న శ్రీ దుర్గాదేవిగా, 23న శ్రీ మహిషాశుర మర్దినిగా, శ్రీ రాజరాజేశ్వరీదేవి అవతారాలలో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంకీర్తన, భజన కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

లలితా పీఠంలో....

లలితా పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం పంచామృతాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొలిరోజు కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, చండీహోమం, చండీ సప్తశతి పారాయణ, శ్రీ చక్రనవరాత్రి ఆవరణార్చన నిర్వహిస్తారు. సాయంత్రం నక్షత్ర దీపాలంకరణ సేవ, మంగళ హారతితో తొలిరోజు కార్యక్రమాలు ముగుస్తాయి. తొలిరోజున అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు.



పీతలవానిపాలెంలో ఏర్పాటు చేసిన భారీ మండపం

వాడవాడలా మండపాల ఏర్పాటు..

మద్దిలపాలెం : శరన్నవరాత్రి ఉత్సవాలకు కాలనీలో మండపాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో రంగు రంగుల విద్యుత్ వెలుగులో కాలనీలు కళకళలాడుతున్నాయి. జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెం కూడలిలో భారీ మండపం ఏర్పాటు చేశారు. దీనికి అద్భుతంగా సెట్టింగ్ చేశారు. భారీ దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పితాపురం కాలనీలో ఆటోస్టాప్ వద్ద భారీ సెట్టింగ్‌లో దుర్గాదేవి మండపాన్ని తీర్చిదిద్దారు. అలాగే ఇసుకతోట ఆటో స్టాండ్, మద్దిలపాలెం, హెచ్‌బీకాలనీ, ఇసుకతోట దుర్గాదేవి ఆలయాలను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. దీంతో ఆ ప్రాంతాలన్నీ పండగ శోభ సంతరించుకున్నాయి.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ, తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. రాజీవ్‌నగర్, వెటర్నరీ కాలనీల్లో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా సచివాలయం సిబ్బంది, స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానికులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందికి ఎంపీ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎవరు ఎంతెంత లబ్ధి పొందారు, వాటిని ఏవిధంగా వినియోగించుకుంటున్నారో నేరుగా ప్రజలతో మాట్లాడి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారని తెలిపారు. మళ్లీ ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగ్గపల్లి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి అమావాస్య పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం : మహాలయ అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలో గల గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో కాలభైరవ స్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సూర్యప్రకాశశర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తుల పేరిట అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

మహోన్నత వ్యక్తి జాలాది

బీచ్‌రోడ్డు : తెలుగు వాళ్ల గొప్పదనాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి సినీ గీత రచయిత జాలాది రాజారావు అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. జాలాది 12వ వర్ధంతి సందర్భంగా శనివారం బీచ్‌రోడ్డులోని జాలాది విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 250 చిత్రాలకు 1800 పాటలు రాసిన జాలాది తెలుగు వాడు కావటం గొప్ప విషయమన్నారు. ఆయన దక్షిణాదిలోనే కాకుండా ఉత్తరాదిలో కూడా గొప్ప రచయితగా పేరు సాధించారన్నారు. ఆయన రాసిన పాటల్లో దేశభక్తి, సర్వమత సమానత్వం తొణికిసలాడుతాయన్నారు. అనంతరం గ్రేసియస్ చారిటబుల్ సంస్థ సభ్యులు అనాథ బాలికలకు ఉచితంగా నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జాలాది విజయ, జాలాది శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.



జాలాదికి నివాళులర్పిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

కృష్ణా కళాశాల అధ్యాపకుడు 'పోలా'కు ప్రధాని ప్రశంస



ఉమామహేశ్వరరావు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృతం అధ్యాపకుడు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు పొందారు. పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు తగు సూచనలు చేసినందుకు పోలాను ప్రధాని అభినందిస్తూ కళాశాలకు ప్రశంస పత్రాన్ని పంపించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. 'మీ భాగస్వామ్యం మీ పిల్లల భవిష్యత్తు పట్ల మాత్రమే కాకుండా మన యువతరం ఎదుర్కొంటున్న అనేక సమస్యల పట్ల మీ చిత్తశుద్ధి ప్రతిబింబిస్తుంది'అని ప్రశంస పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు
- ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన శిక్షణ తరగతులు




పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ తదితరులు

గోపాలపట్నం: పరిశ్రమ 4.0 కాన్సెప్ట్‌ను అనుసరించి ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలని విశిష్ట శాస్త్రవేత్త డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ అప్లికేషన్స్‌పై ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవో, దేశాభివృద్ధి కోసం ఉద్యోగులంతా ఆధునిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ క్రమ పద్ధతిలో ప్రాజెక్టు పూర్తికి పరిశ్రమ 4.0 దోహదపడుతుందన్నారు. అత్యంత ప్రయోజనకరమైన ఈ కోర్సులో స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, ఎఫ్ కోర్సు డైరెక్టర్ ఎస్.మధుకిరణ్, శాస్త్రవేత్త, జీ టెక్నాలజీ డైరెక్టర్ కేదార్‌నాథ్, ఐఐటీ, పలు వర్సిటీలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : చక్రధర్‌పూర్ డివిజన్, రూర్కెలా స్టేషన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల నిమిత్తం సోమవారం(ఈ నెల 16వ తేదీ) జగదల్‌పూర్-రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్-రూర్కెలా(18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

ప్రయోగాత్మక హాల్ట్ : ప్రయాణికుల సౌకర్యార్థం రూర్కెలా-జగదల్‌పూర్-రూర్కెలా(18107/18108) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి బ్రమా స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.



నేడు బెంగళూరు-హతియా వన్ వే స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు-హతియా(06503) వన్ వే స్పెషల్‌ను నడుపుతున్నారు. ఈ రైలు బెంగళూరులో ఆదివారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరి అదే రోజు అర్ధరాత్రి 2.35 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి సోమవారం సాయంత్రం 5.45 గంటలకు హతియా చేరుకుంటుంది.

ఘనంగా హిందీ పక్షోత్సవాలు



పురస్కారాలను అందజేస్తున్న రియర్ అడ్మిరల్ మనీష్ శర్మ

సింధియా: తూర్పు నావికాదళ సాముద్రిక ఆడిటోరియంలో శనివారం హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నావికా హెడ్‌క్వార్టర్స్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షిక హిందీ మ్యాగజైన్ పూర్వివాణి 29వ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో పూర్వివాణి మ్యాగజైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం హిందీలో అధికారిక కార్యక్రమాలను నిర్వహించడంలో విశేష కృషి చేసిన వివిధ యూనిట్లకు రాజభాషా పురస్కారాలు అందజేశారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



తొమ్మిదో వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో బీటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. విశాలాక్షినగర్ ప్రాంతం సంజీవినగర్, దయాల్‌నగర్ కాలనీల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో శనివారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.49 లక్షలతో ఈ పనులు జరుపుతున్నట్లు తెలిపారు. పనులు వేగంగా జరిపించి వినియోగంలోకి తీసుకురావాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'వాల్ డెకరేషన్'కు కొరవడిన నిర్వహణ

- వాడిపోయిన మొక్కలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ విభాగం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన వాల్ డెకరేషన్ కళ కోల్పోయింది. సందర్శకులు, వాహన చోదకులను ఆకర్షించేలా గత జూలైలో ఎంవీపీ కాలనీలోని పలు చోట్ల జీవీఎంసీ వాల్ డెకరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఏట్ ఎంవీపీ కాలనీ పేరుతో వివిధ రకాల ఇండోర్ ప్లాంట్స్ తో కూడిన వాల్‌ను ఏర్పాటు చేశారు. ఏఎస్ రాజా సర్కిల్ నుంచి ఉషోదయ కూడలికి వెళ్లే రోడ్డులో కల్వర్ట్ వద్ద ఒకటి, లాసన్స్‌బే కాలనీ సచివాలయం సమీపంలోని బీచ్‌రోడ్డు మార్గంలో మరొకటి ఏర్పాటు చేశారు. అయితే టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటి నిర్వహణపై శ్రద్ధ వహించకపోవడం, స్థానిక సిబ్బంది పర్యవేక్షించకపోవడంతో అవి కళావిహీనంగా మారుతున్నాయి. ఏర్పాటు చేసి 3 నెలలు కూడా కాకుండానే అందవికారంగా దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తక్షణమే వాటి పర్యవేక్షణ బాధ్యత చేపట్టి వాల్ డెకరేషన్ అందంగా ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.



ఎంవీపీ కాలనీ- ఉషోదయ రోడ్డులో దుస్థితిలో ఉన్న వాల్ డెకరేషన్

యూజీడీ పనులకు శంకుస్థాపన

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని పిఠానివీధిలో యూజీడీ పైప్‌లైన్ పనులకు శనివారం ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈ ప్రాంతానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన నేపథ్యంలో పలు సమస్యలు గుర్తించామన్నారు. అందులో భాగంగా ఈ డ్రైనేజీ పనులను చేపట్టాలని జీవీఎంసీ ఆధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దానికి స్పందించిన అధికారులు ప్రతిపాదనలు ఆమోదించి నిధులు మంజూరు చేశారన్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

ఆరిలోవ : తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ఆల్ ఇండియా బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభించారు. విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలు ఈనెల 16 వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భారతదేశంలో క్రీడలకు చక్కటి ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, ఆరిలోవ సీఐ సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, మొల్లి వెంకటరమణ, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలి

- ఆర్‌జేడీ జ్యోతికుమారి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి కోరారు. చిన్నారుల సమగ్ర వికాసానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 120 రోజుల పాటు నిర్వహించిన జ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ మాట్లాడారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసు గల పిల్లలందరూ తప్పకుండా చదవడం, రాయడం తదితర చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని కోరారు.



శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై, విద్యపై పూర్వ ప్రాథమిక దశ నుంచి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకుడు పైడి వెంకటరావు, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అకాడమీ మానిటరింగ్ అధికారి డాక్టర్ జి.లక్ష్మి, కోనసీమ ఏఎంవో పి.రాంబాబు, కీ రిసోర్స్ పర్సన్లు ఆర్.ఎన్.ప్రసాద్, నిర్మలా కుమారి, హరిణి, తాతాజీ, రమాదేవి, సుచరిత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి పేర్కొన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ లెవెల్‌లో బీస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ బోటనీ, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ, బీఎస్సీ ఆనర్స్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ హిస్టరీ, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీబీఏ హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు 12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7032270810, 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలని కోరారు.